ఆదివారం
ప్రజాశక్తి
డిసెంబర్ 15, 2002



పట్టణాల్లో పేదలకు తావెక్కడ ?

హ్యాపీ బర్త్‌డే

(15-12-2002 నుండి 21.-12-2002 వరకు)

సృజన్
2సం,15. 12. 2000
పద్మ-రాజ
జిన్నూరు-ప.గో.

సిహెచ్.చుట్కీ
3సం., 15.12.1999
శోభ-అశోక్
శంకర్‌పల్లి-రంగారెడ్డి

నికేష్‌కుమార్
1సం., 15.12.2001
సుజాత- వాసు
హైదరాబాద్

కుషాల్‌సాయికుమార్
5సం., 16.12.1997
లత-శ్రీనివాస్
తుకారంగేట్

వంశీప్రసాద్
4సం., 17.12.1998
సునీత- సోమ్లానాయక్
కొడిపల్లి- మెదక్

జుట్టుకొండ అఖిల
8సం., 17.12.1994
రాధ- బస్వయ్య
కోదాడ- నల్లగొండ

ఎన్. వెంకట జితేంద్రరెడ్డి
1సం., 18.12.2001
వెంకటలక్ష్మి-వెంకటకృష్ణారెడ్డి
ఏలూరు- ప.గో.



రాపర్తి స్నిగ్ధ
1సం., 18.12.2001
మమత- ప్రకాష్
సినిమారోడ్- ఆదిలాబాద్

పి.అభినవ్
2సం., 19.12.2000
అరుణ-రమణ
సిల్‌క్యాంపస్- ఖమ్మం

ఎస్. కిరణ్మయి
1సం., 19.12.2001
వెంకటలక్ష్మి-భాస్కరరావు
తాడేపల్లిగూడెం-ప.గో.

పండు
2సం., 20. 12. 2000
ఉమాదేవి- రమణరావు
కృష్ణలంక-విజయవాడ

ఎస్. శ్రీకాంత్
5సం., 20.12.1997
రత్నమ్మ- శ్రీరామ్‌రెడ్డి
ఉదయగిరి- నెల్లూరు

...మారికి రంగులు వేస్తే....

నేస్తాలూ...

బొమ్మలో చిట్టి రాకుమారి ఓ గుర్రంమీద ప్రయాణం ఈ బొమ్మ చూస్తుంటే మీక్కూడా గుర్రం మీద ...్ చల్' అనాలనుంది కదూ. ఈ బొమ్మకు రంగులేస్తే ...ుంటుంది. మరి రంగులు తీసుకోండి.

కలం స్నేహం

పేరు: పి.సాయిబాబా
వయసు : 12 సం॥
చదువు : 6 వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, బొమ్మలు వేయడం
పూర్తి చిరునామా :
...యిబాబా, సన్నాఫ్ పి.రాజు, ఇంటినెంబరు 1-2-607/ ...ి, డిబిఆర్ మిల్లు వెనుక, సుభాష్ చంద్ర బోస్ నగర్, ...రాబాదు.

... : పోట్ల కార్తీక్
...సు : 9 సం॥
...వు : 4వ తరగతి
...లు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
...ర్తి చిరునామా : పోట్ల కార్తీక్, ...గుంట, కొడవలూరు, నెల్లూరు.

ఇమామ్ క్షవరం

నసీరుద్దీన్ ఓ సారి క్షవరశాల తెరిచాడు. ఇమామ్ అనే వ్యక్తి ఓ రోజు పొద్దున్నే వచ్చి క్షవరం చేయమన్నాడు. తర్వాత డబ్బులివ్వకుండా వెళ్లిపోయాడు. ఆరోజు వచ్చిన బేరమే తక్కువ. దాంతో నసీరుద్దీన్‌కి వళ్లు మండిపోయింది. ఇమామ్‌కి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నాడు. ఓ నెల రోజుల తర్వాత ఇమామ్ మళ్లీ వచ్చాడు. ఏం తెలియనట్టే క్షవరానికి కూర్చున్నాడు. నసీరుద్దీన్ అతనికి గుండు గీశాడు. 'కనుబొమల సంగతి ఏంటి? కావాలా' అని అడిగాడు. 'కావాలా యేంటి? నీకు ఆ మాత్రం తెలీదా, అడగడం ఎందుకు?' అన్నాడు ఇమామ్. 'సరే మీరు కావాలంటే తప్పదుగా' అంటూ నసీరుద్దీన్ రకామని కనుబొమలు తీసి ఇమామ్ చేతిలో పెట్టాడు. ఇమామ్‌కి చెప్పలేనంత కోపం వచ్చింది. నోరు పెగలలేదు. కాని యేం చెయ్యగలడు? తనే కావాలన్నాడుగా. నసీరుద్దీన్ లోలోపల నవ్వుకుంటూ 'గడ్డం కావాలా?' అన్నాడు. ఇమామ్ వెంటనే 'అక్కర్లేదు నాయనోయ్ అక్కర్లేదు' అన్నాడు గబగబా. సరే అక్కర్లేకపోతే పోనీయండి. మీ ఇష్టం' అంటూ నసీరుద్దీన్ అంతే తొందరగా ఇమామ్ గడ్డం గీకేశాడు. అది నేలమీద పడింది. ఇమామ్ కంగారుగా అద్దంలో చూసుకున్నాడు. బోడిబుర్ర, కళ్లు కనిపించాయి. తన తలకాయ అచ్చు తోమిన చెంబులాగా మెరుస్తూ కనపడిందతనికి. ఇక కోపం పట్టలేక నోటికొచ్చిన శాపనార్థాలు పెట్టాడు నసీరుద్దీన్‌ని. దానికి నసీరుద్దీన్ అమాయకంగా మొహం పెట్టి 'ఏంటండీ నన్ను తిడుతున్నారు. మీరు నేనడిగిన దానికి తిన్నగా సమాధానం చెప్తే ఈ తిప్పలు వుండేవికాదుకదా. అసలు మీకు క్షవరం చేయడం నాకు మొదటే ఇష్టం లేదు. ఇలా అవుతుందని మొదటే అనుకున్నాను' అన్నాడు.

బాతుపిల్లకి సాయం చేస్తారా

రుక్మిణి



నిజమే! నిండుగా పిటపిట లాడిపోతున్న ఆ 'బస్తా' పలురకాల ఆలోచనలకు అక్కడి జనాల్లో కారణమైంది. మొదటి ప్రశ్న ఆ బిగుతు గోనె గోతంలో ఏముండి వుండవచ్చు! నగలా? నాణాలా? కొంపదీసి ఆర్డీయెక్సులాంటి, బాంబులే అయితే తామందరూ 'ఢా'మ్మని పేలి పోవాల్సిందే! భయంతో జనాలు జరజర పదడుగులు వెనక్కి జరిగారు.

"ఏమోరా... బిగుతుగా కుట్లు కూడా వేసి వున్నాయి గద! ఖర్మం! ఎవడ్నైనా చంపిగానీ దాన్లో కుక్కి పారేసి నారేమో!" వీరయ్య మునలి దవడలు నొక్కుకుంటూ అన్నాడు.

"దెసె... పీనుగ్గాని వుంటే నెత్తురు చుక్కలు ధారలు కట్టవేంటి?" మరో యువకుడు ఈసడించాడు. ఆ గోనె సంచీ దాకా పోదామంటే భయం! పోకుండానే దాన్లో ఏముందో చూసి తీరాలన్న ఆరాటం... తాపత్రయం!

అప్పటికి మిట్ట మధ్యాహ్నం కావస్తుంది – జనం గుంపులు చేరుతూనే ఉన్నారు. రకరకాల చర్చలు చేస్తూనే వున్నారు. అపుడు యాద్గిరి బీడీ చివరి దమ్ము పీకి అవతలకు విసిరేసి గుంపును తోసుకుంటూ జాగ్రత్తగా బస్తా దగ్గరకు పోయి... పోలీసు కుక్కలా మూతితో మూడుసార్లు వాసన బీల్చి.. కళ్ళు చికిలించి పెనుకేక లాంటిది పెట్టనే పెట్టాడు. ఆ దెబ్బకి జనం వులిక్కిపడి వీపులు చరుచుకున్నారు.

"ఒర్నీ... ఇది బియ్యంరా... బస్తా బిగుతుగా బియ్యం... అరె... ఇదుగో ఇక్కడ నేలమీద బియ్యం పలుకులు పడున్నాయి గద.. ధు... అంత భయమైతే ఎట్ల?" యాద్గిరి మరో బీడీ వెలిగించాడు. దాంతో జనాలందరిలో ప్రాణాలు లేచి వచ్చినట్లయింది! ఏ బాంబో... బడితో లేకపోవడం వల్లే పెద్ద బెడద తప్పిపోయిందని నిట్టూర్చారు. అట్లా జనాలు దాని గురించి మల్లగుల్లాలు పడుతూనే ఉన్నారు. అప్పటికే ఊర్లో వివరం పాకిపోవడం ఏంటి... క్షణాల మీద కింది బజారు రాజయ్య మీసాలు మెలేస్తూ ఓ గుంపును వెంటేసుకుని హడావుడి పడుతూ అక్కడికి వచ్చి పడ్డాడు.

"ఓసోస్... ఓరి గురువులూ... ఈ 'బస్తా' మన తాలూకే! అయినా ఇది ఈడపడిపోడం ఏంటీ? దీని జతగా మరో లారీడు బస్తాలుండాలి గదా... రాత్రివూట మిల్లుకు లెక్కేసి దిగబెట్టి రమ్మని పంపితినాయె! ఈ లారీ ముండా వాళ్ళు పూటుగ తాగి యాడ చేర్చిర్రో ఏమో! అరె...!" అని వచ్చీరావడంతోనే ఆపసోపాలకు తగులుకున్నాడు. జనాలు మాత్రం ఇంత సేపటి దాకా ఆ ఒక్క బియ్యం బస్తా దెబ్బకే హడలి చచ్చి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అల్లాడిపోయినారు గదా... మరి రాజయ్య గారేమో ఇంకా మరో లారీడు లోడు బియ్యం అంటున్నాడు. వాటి మొత్తం దెబ్బ ఎవడికి, ఎక్కడ తగిలి వాడు కిసుక్కుమని పోతాడో అని గుబులు పడిపోతున్నారు గదా!

అదుగో... అపుడు జక్కులోడు కీసరబాసరగా అరిచినంత పని చేశాడు. అక్కడ పాతబడిన పాత గుడిసెలో తాటాకు దడి తెరిచిన వాడు నోరు వెళ్ళబెట్టి చూద్దానికేముంది దొంతర్లు దొంతర్లుగా పిటపిటలాడిపోతున్న బియ్యం... ఒకదాని మీద ఓటి... వంద!

"అదీ... అద్దదీ... వెధవలు ఈడ పేర్చినారన్నమాట.. బాగుంది.. కిరాయి అడగడానికి వస్తే కీళ్ళు విరుస్త.. ఒరే వెంకులూ... ఈరిగా... జల్ది... లారీ తెప్పించండి! మిల్లుకు పోవాలె" రాజయ్యగారు పంచెవూడిందాకా చిందులు తొక్కుతూ హుకుంలు జారీ చేసి పారేస్తున్నాడు గదా! అదుగో అపుడు పెద్ద బజారు నుండి ఉరుకులు... పరుగులు... ఈలలు... హుంకరింపులతో చంద్రయ్యగారు వురికి వచ్చి పడ్డారు.

"అన్యాయం... ఘోరం... మోసం.. కుట్ర... దగా...!"

జనాలు ఈ 'కుట్ర' వివరం తెలవక తలలూ.. చంద్రయ్య అరుపులకు గుండెలు బాదుకున్నారు. "అవి మిల్లు నుండి తెస్తున్నవీ కావు... మిల్లుకు తోలెడివీ కాదు.. నేను ఖరీదు చేసిన సరుకు పట్టండెహె... ఒరే... తలా పది చొప్పున కూలీ పారేస్తగానీ మా కొట్టంలోకి చేర్చండిరా" చంద్రయ్య ఏకంగా బస్తామీదెక్కి హారం వేసి కూర్చున్నాడు. అవతల పండ్లు నూరుతూ రాజయ్య... కండ్లురుముతూ చంద్రయ్య... ఎవరికీ ఏం పాలుపోలేదు గానీ ఈ లోపున ఆ ఇద్దరి మధ్యనా మాత్రం మాటల యుద్ధం మా జోరుగా చెలరేగి ఊరికే మండిపడిపోతున్నారు.

జనాలకు నీరసం ఆవరించింది. మధ్యాహ్నపుటెండ మరికాస్త తగ్గి సూర్యుడు పడమరకు వంగబోతున్న సమయంలో బొయ్యిబొయ్యిమని జీపు ఓటి వచ్చి ఆగింది – దాన్నుండి బిల బిలమని పత్రికా విలేకర్లు... ఫొటోగ్రాఫర్లు... మరికొందరు పెద్ద మనుషులు దిగనే దిగారు – టకటకమని వాళ్ళు ఫొటోలు లాగించేస్తుంటే చంద్రయ్య చెంగున బస్తామీద నుండి గెంతి దూరంగా జరిగి నిలబడ్డాడు. రాజయ్య మిటుకూ మిటుకూ మిడిగుడ్లేసుకుని కండ్లు మిటకరించ సాగాడు.

"ఇవి పనికి ఆహారం బియ్యం... పంజాబు సరుకు.. రాజయ్యగారివేనని తెలిసి.. ఎవరికి పంచడానికీ.. ఎక్కడ ఏ పనులు చేయించినారో చూద్దానికి ఇట్లా వస్తున్నాం.. మీరు మీ బామ్మర్ది పేరు మీద కాంట్రాక్టు తీసుకున్నట్లుంది..!"

"అబ్బే... అబ్బే.. వాడి పనులింకా పూర్తి కాలేదు.. అసలు సంగతేమిటంటే నాకు పంజాబు తెలవదు... ఒరిస్సా పట్టదు. జనాలందరూ చోద్యం చూస్తుంటే కోతులాడిస్తున్నారేమోనని చూద్దానికి వచ్చాను. అంతే! మాకేంటి.. ఎవడి సరుకో ఎవడికెరుక!" రాజయ్య మటమటలాడుతూ మాట మళ్లించడంతో అక్కడున్న జనాలకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది.

"మరయితే మరి మన చంద్రయ్యగారు..

మాట ముగించే లోగానే చంద్రయ్య అగ్గిరావుడిలా ఎగిరెగిరి పడ్డాడు. బియ్యం బస్తాను కసిగా రెండు తన్నులు తన్ని కాలు పట్టుకున్నాడు.

"అబ్బా! ఈ బియ్యం... ఈ బస్తాలు.. ఎవడి సరుకో... ఎఫ్‌సీఐ వాడికెరుక! అసలు ఈ రాజయ్య తాలూకు వాళ్ళవే అయ్యుంటాయి – మాకు ఇలాంటివేం పట్టవ్. అయినా ముందు ఈ గుడిసె ఎవడిదో... ఈ జాగా... ఎవడిదో అది తేల్చండి ముందు!" జబ్బలు చరచడంతో జనంలో కలకలం చెలరేగింది. తీవ్రంగా చర్చలు.. సమాలోచనలు... జరిపింతర్వాత ఆ గుడిసె చంద్రయ్య 'కమతం'లో కొంతకాలం... రాజయ్య 'దళం'లో మరికొంతకాలం గుడ్డిగా నానా గడ్డీ కరిచి రకరకాల పనులు చేసి చివరికి వీళ్ళిద్దరికీ సంబంధంలేని బోజయ్య గారి దగ్గర నమ్మకం నౌకరికి కుదురుకున్న గోవిందంగాడిదనీ తేలింది. జాగాను బోజయ్య గారే బినామీగా కబ్జా చేసినా అడిగే నాథుడూ కలుగజేసుకునే యోధుడూ లేకపోవడంతో అట్లా ఎటుగాకుండా పడావు పడుందని తేలిపాయె!

"అయితే ఈ అక్రమ నిల్వలు మీవి కావంటారు?" వీడియో విలేకరి గుచ్చి గుచ్చి అడిగాడు.

ఛ... ఛ... ఆ చండాలంతో మాకేం సంబంధం లేదంటే లేదు. అదే విషయం రాసుకోండి – అందులోనూ అట్లాంటి పనులు మా ఇంటా–వంటా లేవు" – గుళ్ళో పూజారులు యుగళంగా వేదమంత్రాలు చదివి పారేసినట్లు ఇద్దరూ అనేయడంతో అందరూ అవాక్కయ్యారు–

"మరీ మంచిది – అవతల పొయిలో పిల్లి లేవక... మూకుల్లోకి చారెడు గింజల్లేక పిల్లా–పాపా.. ముసలీ ముతకా... విలవిల్లాడిపోతున్నాం బాబయ్యా... ఎవరికీ కాని సొమ్మును పేద ప్రజలు వాడుకుంటే ఎవరికీ ఎట్లాంటి అభ్యంతరాలుండవు గదా... పటండెసె.. దొంగ సరుకో... దొర బియ్యమో... అసలు ఇవన్నీ చెందాల్సింది మా కూల్నాలి జనాలకు – తలా సేరుడు తీసుకుని వండుకుతింటే దండించేదెవరటా?'

ముసలి గురివిగాడు హుషారు చేస్తుంటే –అక్కడున్న అందరూ అవాక్కైపోయారు. ★

టెన్నిస్ ఆశాకిరణం సానియా

హసన్ షరీఫ్

ఆమె ఇటీవలే తన 16వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంది. కానీ అందరు టీనేజర్లకు ఆమె భిన్నం. ఆమె కళ్లలో కలలు, అడుగులో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఆమెపేరే సానియా మీర్జా...

భారత మహిళా టెన్నిస్ సానియాపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆమె ఇటీవల విదేశాల్లో ఆడిన తొలి ప్రొఫెషనల్ టోర్నమెంట్‌లో అద్వితీయ విజయం సాధించింది. మనీలాలో జరిగిన రెండు ఐటిఎఫ్ మహిళా సింగిల్స్ టైటిళ్లను (పదివేల అమెరికా డాలర్ల విలువైన) సానియా కైవసం చేసుకుంది. కొద్ది వారాల తర్వాత హైదరాబాద్‌లో జరిగిన మరో టోర్నీలో కూడా గెలుపొంది మూడో టైటిల్ సొంతం చేసుకుంది. దీంతో భారత మహిళా టెన్నిస్‌లో గుభాళిస్తున్న గులాబీగా మారింది. ఈ హార్డ్‌స్ట్రోక్ క్రీడాకారిణి రాధికా తుల్పులేతో కలిసి డబుల్స్ టైటిల్ కూడా సాధించడంతో ఆల్‌రౌండ్ క్రీడాకారిణిగా మారింది. బుసాన్‌లో జరిగిన ఆసియా గేమ్స్‌లో ప్రముఖ ఆటగాడు లియాండర్ పేస్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించడం ద్వారా తక్కువ వయస్సులోనే ఆసియాలో ఉత్తమ క్రీడాకారిణిగా పేరు సంపాదించింది. 16 సంవత్సరాల వయస్సులోనే జాతీయ హార్డ్‌కోర్ట్ ఛాంపియన్‌గా నిలిచిన సునీల్ కుమార్ తన తొలి ప్రొఫెషనల్ టైటిల్ సాధించడానికి మూడు సంవత్సరాలు వేచివుండాల్సి వచ్చింది. మహిళా టెన్నిస్‌ను పురుషుల టెన్నిస్‌తో పోల్చడం కూడా సరికాదు. కానీ దేశంలో ఇటీవల సానియాను ఎవరూ అందుకోలేకపోతున్నారనే విషయం మాత్రం సుస్పష్టం. భారత్ తరఫున అంతర్జాతీయ స్థాయిలో అతితక్కువ ర్యాంకు సాధించిన క్రీడాకారిణి నిరుపమా వైద్యనాథన్. ఆమె కెరీర్‌లో సాధించిన ఉత్తమ ర్యాంకు 134. మనీషా మల్హోత్రా, సాయి జయలక్ష్మి, రష్మీ చక్రవర్తి, రాధికా తుల్పులే, మేఘా వఖారియా కూడా రాణిస్తున్న భారత క్రీడాకారిణులు. కానీ వాళ్లలో ఎవరూ కూడా 16 ఏళ్ల ప్రాయంలోనే సంచలన విజయాలు నమోదు చేసుకోలేకపోయారు. "ఇటీవల జూనియర్ స్థాయిలో పలు అంతర్జాతీయ టైటిళ్లు సాధించిన నేను తొలి ప్రొఫెషనల్ టైటిల్ సొంతం చేసుకోవడం ఆనందం కలిగించింది" అని సానియా పేర్కొంది.

సానియాకు ఆమె తల్లిదండ్రుల నుండి పూర్తి సహకారం లభిస్తోంది. సానియా గ్రాండ్‌శ్లామ్‌లతో సహా ప్రపంచ నలువైపులా జరిగే టోర్నమెంట్లలో పాల్గొనేందుకు అవసరమైన డబ్బును ఆమె తండ్రి ఇమ్రాన్ మీర్జా తన వ్యాపారం ద్వారా సమకూరుస్తున్నారు. సానియా వెంట ఆమె తల్లి నసీమా ప్రయాణిస్తూ చేదోడువాదోడుగా వుంటోంది. జివికె గ్రూప్, అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్‌ల సహకారం ఆమెకు ఇటీవల మాత్రమే లభిస్తోంది. జూనియర్ ఫెడ్ కప్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఐదో స్థానం సాధించడంలో సానియా కృషి ఎనలేనిది. యు.ఎస్. ఓపెన్ గ్రాండ్‌శ్లామ్‌లో సానియా, ఇషా లఖానీల జోడీ డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్ వరకూ చేరుకోగలిగింది. ఇప్పుడు సానియాకు అడిడాస్ సంస్థ అండ లభించింది. దీంతో ఆమెకు ఆమెకు ఆకాశమే హద్దుగా మారే అవకాశం లభించింది. సానియా ఇతర విషయాలపై దృష్టి నిలపకుండా పూర్తిగా టెన్నిస్‌కు అంకితమైతే ఆమె ప్రపంచంలోనే ఉత్తమ క్రీడాకారిణిగా ఎదిగే సమయం ఇంకా ఎంతోదూరంలో లేదు. ఆమె సర్వీసులు, ఫోర్‌హ్యాండ్ షాట్లు కొట్టడంలో దిట్ట. ఆమెలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఆమె తన లక్ష్యంపై పూర్తిగా పట్టుదలతో ఉంది. "వచ్చే సంవత్సరం పూర్తయ్యేలోపు నేను 300లోపు ర్యాంకు సాధించాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను. 2004వ సంవత్సరం వరకు గ్రాండ్‌శ్లామ్ టోర్నీల్లో పాల్గొనే అర్హత సాధించాలి" అని సానియా తెలిపింది. "నేను జూనియర్ స్థాయి టెన్నిస్‌ను చాలా ఆడాను. ఇక సీనియర్ స్థాయి ఆటగాళ్లతో ఆడితేనే నా గేమ్‌లో అభివృద్ధి కనబడుతుంది. ప్రొఫెషనల్స్‌తో తలపడకుండా నా అభివృద్ధిని కుదించుకోవడం నాకే నష్టదాయకం" అని సానియా పేర్కొంది. సాధారణంగా జూనియర్ స్థాయిలో అద్వితీయ ప్రతిభ కనబర్చే భారత ఆటగాళ్లు కీలకమైన 16-17 ఏళ్ల ప్రాయంలో ఆటలకు గుడ్‌బై చెప్పి ఇతర రంగాల్లో స్థిరపడతారు. సానియా రూటే వేరు. ఆమె 16-17 ఏళ్ల మధ్య పది ప్రొఫెషనల్ టోర్నమెంట్లు, ఫెడ్‌కప్, మూడు నాన్ టూర్ ఈవెంట్లలో పాల్గొనబోతోంది. దీంతో ఆమె 18 ఏళ్ల వయస్సుకు వచ్చేసరికి 13 ప్రొఫెషనల్ టోర్నమెంట్లలో పాల్గొనగలుగుతుంది. ఆమె రాటుదేలేందుకు ఈ మ్యాచ్‌లు సరిపోతాయి. "గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్‌లో విజయం సాధించాలనేది ప్రతి టెన్నిస్ ఆటగాడు కనే కల. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది నాకు ఒక కలగానే ఉంది. తొలుత రాబోయే రెండేళ్లలో 100లోపు ర్యాంకు సాధించాలనే లక్ష్యాన్ని సాధిస్తాను. 20 ఏళ్ల వయస్సు వచ్చే సరికి 20 ర్యాంకుల్లోపు స్థానం పొందాలని అనుకుంటున్నాను" అని సానియా పేర్కొంది. అనుకున్నది సాధిస్తే భారత్‌కు లభించిన టెన్నిస్ ఆణిముత్యం సానియా.

★

రుక్మిణి

అక్కడ గదిలో గాలి ఉక్కగా, మనుషులు తిక్కగా వున్నారు. పైన పంకా నిస్సహాయంగా తిరుగుతుంది. చాలా కాలం నుండీ ఆ గోడలు మకిలి వాసనను వదలకుండా, ముసలి దర్పం, రోగిష్టకంపూ నింపుకునే వున్నాయి. అక్కడి చెక్కస్టాండులో బిగించిన తుపాకులు పేలినా... పేలకపోయినా... అసంఖ్యాక అసంతృప్తులైన జనాల నోళ్ళు పేలకుండా, పాలకుల మీద కాకినీడ కూడా వాలకుండా మాత్రం అవి అట్లా ఉండడం వల్ల అప్పటికా అవసరం తీరిపోతూనే వుంది. ఇక నిర్భాగ్యంగా ఆ కరుడు గట్టిన రాతిగోడకు నిర్దాక్షిణ్యంగా దుమ్మయినా దులపని బోసినవ్వుల బాపూజీ ఆ పటంలో చాలా రోజుల్నుండి బుగ్గలు పీక్కుపోయేలా నవ్వుతూనే వున్నాడాయె!

''ఇది మాత్రం చాలా సీరియస్సు... అబ్బో... సీరియస్సే!'' అనడానికీ–ఆ మాట వినడానికీ – ఆ కుర్చీ నిండుగా... భారీగా కూర్చుండిపోయిన సీనియరు యస్సై సోంరెడ్డిగారు తన మొత్తం సీనియారిటీ నిండుగా అట్లాంటి 'సీరియస్సు మాటర్సు' చాలాచాలా చూసి వుండడం వల్లనైతేనేమీ... తిన్నది బాగా హరాయించుకోలేకపోవడం వల్లనైతేనేమీ, పొట్ట బాగా స్వతంత్రంగా ముందుకు చొచ్చుకొని వస్తే – వారి సీనియారిటీకి తలమాడు మాత్రం మాపి చక్కటి బీడులా మారిపోవడంతో అవి అట్లా చేదోడు వాదోడుగా మిగిలిపోయినాయి!

"అయితే ఏం చేద్దామంటారు సార్!" ఆ మాటన్నది ఒక్కడే అయితే చిక్కులేదు. ముచ్చటగా ముగ్గురు. నిన్న రాత్రి సరిగ్గా పన్నెండు గంటల నుండీ ఆ త్రిగళ గీతాన్ని ఆ సీనియరు... సీరియస్సు యస్సైగారి తాలూకు అంగరక్షకులైన రక్షక భటుల యొక్క భారీ కుందా పోట్లకూ... కోదండం దెబ్బల రుచి బాగా మరిగాక ఆ గీతాన్నే బృందగానం చేయడానికి అలవాటు పడి ఆలపిస్తున్నారు.

ఆ ముగ్గురిలో ఒకడు బక్కపలచగా... బద్దలా... రిపటలా.. వయస్సు చెప్పడానికి ఎలాంటి ఆధారాల్లేని విధంగా కొంగలా ముందుకు సాగి, నాలిక చప్పరించే అలవాటునూ.. అమాయకత్వాన్నీ బాగా నటించడంలో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్న వాడిలా వూరికే కనిపిస్తాడు. వాడు తన అవసరానికి మించిన లౌక్యం ఒంటబట్టించుకున్న వేళలో అదికాస్తా ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఆ సదరు మనిషి నిన్న ఉదయం బస్టాండులో గోతాం మూటతో అంగరక్షకులకు చిక్కినప్పుడే తన పేరు ప్రస్తుతానికి రామలింగం అని అప్పటికి తోచింది కాబట్టి అట్లా ప్రకటించుకున్నాడు.

మరోడు గుండ్రంగా వున్నా వాడు జీవితమంతా పాపాలు చేయడానికే పనిగట్టుకుని పుట్టినట్లుగా తనకు తానే తయారైన పుణ్యాత్ముడిలా



కనిపిస్తాడు – పాపారావు మొరటుగా కనిపించినా, వాడి హృదయంలోని కపటత్వాన్ని కనిపెట్టడం కాస్తంత కష్టమే అయినప్పటికి వాడి శరీరం మాత్రం బహుమెత్తనైనదీ... ఫక్తు ఆర్టీసీ వారి బస్సు సీటు స్పాంజిటైపు కావడం వల్ల... అంగరక్షకులు తుపాకీ మడమల్తో వాడ్ని కుమ్మినపుడు ప్రతి కుమ్ముకూ.. పొట్ట చెక్కలయ్యేలా వాళ్ళు పాపారావుతో పాటే నవ్వేస్తారు – గాలి బూరను అదిమితే అంతా ఆనందమే గదా!

మూడోగాయకుడు రాత్రి గోత్రాలు చెప్పించే సందర్భంలో నోట్లో ముందువరుస పండ్లలో నుండి రాలిపడిన రెండు పళ్ళలో ఒకటి బంగారు కవచం కలిగి వుండడంతో వాడు తన పేరు బంగారయ్య అని ప్రకటించుకోవడంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం కనిపించలేదు. ఈ బంగారయ్య అని అనబడుతున్న వాడికి అబద్ధాలంటే ప్రేమకన్నా.. అలవాటంటేనే చాలా మంచిది. గాలి పీల్చుట... మూత్రం విడుచుట ఎట్లా జీవితావసరాలుగా జీవశాస్త్రజ్ఞులు నిర్ణయం చేసినారో తెలవదు గానీ... దానిలో ఈ అబద్ధాలను చేర్చకపోవడం చాలా దారుణమైన విషయమే! వాడికి జీవిత భాగస్వామి వుందో లేదో ఎవరికీ అంతుపట్టకున్నా... అనుభవం వున్న వాళ్ళకు ఈ అబద్ధాలే అతని నిబద్ధతా నీతీ అర్ధాంగీ అని తెలిసిపోతుంది.

"అయితే ఈ సీరియస్సు మాటర్లో అసలు నెంబర్ వన్ క్రిమినల్ ఎవడ్రా?" సోంరెడ్డి బిగుతైన దవడను తన ఇనుపగోళ్ళతో గీక్కుంటూ అడిగాడు. అసలు ఈ ప్రశ్న నిన్నటి రాత్రి నుండీ ఎన్నిసార్లడిగాడో గానీ... అది అతని అపర అభిమాన పరమైన హమ్మింగ్ ట్యూను క్రింద అడ్జస్టయిపోయింది. ఆనక పక్క లాకప్పులో పాత టేబులు మీద వరసగా అప్పటికే ప్రతిష్టించబడిన పాత విగ్రహాల వంక కాసింత విచారంగా... మరింత ఆనందంగా ఓ మారు చూసి, తిరిగి దవడలు గీక్కుని రెచ్చిపోయాడు.

ఈ ముగ్గురు వెధవల్నూ రాత్రంతా కుళ్ళబొడిచే కార్యక్రమం ప్రారంభమైన తరువాత, తెల్లవారుజామునకు ఎలాగొలాగ... ఒక పట్టాన సంధి కుర్చుకుని సరైన ఏకగ్రీవ సమాధానానికి రాలేకపోవడం సోంరెడ్డి కుపితుడు కావడానికి ఒక కారణమైతే... అందులో ఒకడు అబద్ధాలను ఔపోసన పట్టి ఆశువుగా నోటికి వచ్చినట్టు పేలడం సోంరెడ్డి మందపాటి బుర్రకాయను మహాచీకాకు పెట్టేసింది.

'నెంబర్ వన్ క్రిమినల్' విషయంలో ఆ ముగ్గురు వెధవలూ ఊరు వాడా డొంకా ఏకం చేసి ప్రపంచంలో తమ భౌగోళిక పరిజ్ఞానం వున్న ప్రదేశాల పేర్లన్నీ చెప్పడంతో సోంరెడ్డి రెచ్చిపోయి స్వయంగా నాలుగు లాఠీలను విరగదీయక తప్పలేదు – అర్జంటీనా – అరకు లోయా – మెడగాస్కరూ – మెదకు... దుబాయ్... దుబ్బాక అబ్బో! అయితే టింబక్టూ అన్నదేశం పేరు చెప్పి పాపారావు, సోంరెడ్డిని మరీ రెచ్చగొట్టి పారేశాడు.

'టింబక్టూ! ఎవడ్రా అది... వాడో అదో దాని పేరయినా వినలేదు గాదురా! వాడు ఈ చోరీ విగ్రహాలను కొని అగరుబత్తులు వెలిగించడానికి టింబక్టూనుండి రెండు పూలు పట్టుకుని దిగబడి పోతాడూ.. నా చెవుల్లో ఆ రెండూ నూకుతాదూ! నేనుత్త వెధవన్నర పూల పున్నయ్యనూ.. నువ్వు ఆ టింబక్టూ వాడేమో మైకు టైసన్లూ... అనే గదురా మీ ఉద్దేశం!" ఈ టింబక్టూ దెబ్బకు సోంరెడ్డి శివతాండవం చేసి, రెండు లాఠీలు విరిచి, అలసిపోయి తలపట్టుకున్నాడు!

రాత్రంతా కష్టపడి కుళ్ళబొడిచాక అసలు విషయం కాస్తకూస్తో తేలి సోంరెడ్డి మనసు నెమ్మదించసాగింది!

"ఒరే రాస్కెల్స్! ఆ బ్రోకర్ వెధవది ఏ దేశం? ఏ ఊరూ అన్నది అసలు సమస్య కానేకాదు. అండర్‌స్టాండ్!"

ముగ్గురూ కడువినయంగా బుర్రలు ఊపారు.

"వాడు మాత్రం ఈ అపురూపమైన పాతరాతియుగానికి చెందిన ఈ విగ్రహాలను కోటి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి..."

ముగ్గురు క్రిమినల్స్‌లో లౌక్యం తెలిసిన రామలింగానికి ఇదే విషయం అసలు రుచించడం లేదు. - రాత్రి ఒళ్ళు హూనమవుతున్నా పదే పదే ఈ విషయంలో తన నిరసనను ప్రకటిస్తూనే ఉన్నాడు కూడా!

"పాతిరాతియుగం కాద్సార్... పల్లవులూ... రెండవ పులకేశి కాలం అనీ క్రీ.త. నాలుగవ శతాబ్దం అనీ... క్రీ.పూ. మూడవ శతాబ్దం అనీ... కాదూ మగధ బింబిసారుడి కాలం అనీ ఆర్కియాలజిస్టులూ..."

తర్వాత వాడి మూతి ఓ పిడిగుద్దుకు పేలిపోయింది! సోంరెడ్డికి ఇలాంటి పనికిరాని పరిజ్ఞానం అంటే ఎక్కడలేని చీకాకూ... చీదరా! మరీ ఈ చరిత్రా.. క్రీ.పూ., క్రీ.త. అంటే పులకరం పూనిన రోగిలా వణికిపోయి తన్నులకు తగులుకుంటాడు.

"బద్మాష్! సువ్వర్! పులకేశి ఎవడ్రా? నీ తాతా? బింబిసారుడెవడ్రా బాంచెత్! నీ బామ్మర్దా. అరె. నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలు. ఎవడ్రా వీళ్ళంతా? ఎవడ్రా అసలు నీకు చరిత్ర చెప్పిందీ... థు. దొంగతనాలు, డెకాయిట్లూ చేసే మాదొచ్చద్ గాండ్లకంతా హిస్టరీ.. క్రీతా, క్రీపూ, కాతా ఏంట్రా? ముందు వెనకా ఏమున్నాయిరా ? మూతిపండ్లు రాలినా బుద్ధిరాలేదుబే!"

మరో విడతకు రామలింగంలో లౌక్యం తాత్కాలికంగా రెచ్చిపోయింది!

"అది కా...ద్సార్! ఆ విగ్రహాలు ఏదో ఒక శతాబ్దానివి తేలకపోతే ఆ టింబక్టూ పార్టీ దానిరేటు ఎట్లా కడతాడు సార్! గిట్టుబాటు ధరా.. అడ్వాన్సూ!"

డొక్క తడుముకుంటూ రామలింగం లౌక్యం లొటలొటమని బయటకు రావడంతో సోంరెడ్డి గారి బుర్ర టకటక పని చేసింది!

"అవుగదా!... ధరకూ-చరిత్రకూ లింకుందని ముందే ఒక్కమాట చెప్పొచ్చుగదరా రాస్కెల్! అయితే ఇవి అశోకుడి కాలం నాటి సీతారాముల పట్టాభిషేకం విగ్రహాలు."

"హనుమంతుడు కూడా కొలువుదీరి ఉన్నాడు సార్!" పాపారావు వంక సోంరెడ్డి ఉల్లాసంగానే చూసి ఓ పొడవాటి సిగరెట్ వెలిగించాడు.

"అయితే ఒరే బేవకూఫ్! గచి మీరు ఎక్కడ్నుంచి పెళ్ళగించి తెస్తె? ఆహా! కపాలపురంలోనా.. సోమనాథ దేవాలయంలోనా... దానికీ ఒక బ్యాగ్రౌండూ, సెటప్పూ వుండాలి గదరా!" కర్ర - లాఠీ పార్టీ నుండి సోంరెడ్డిగారు మాటలు బయటపడి కాలం-బేరం-దూరం లెక్కల్లోకి వచ్చేయడంతో బంగారయ్య కాస్తంత రెచ్చిపోయాడు.

"జమలాపురం తవ్వకాల్లో తొంభై అడుగుల లోతున దొరికినవీ యింకా పురాతన కాలానికి చెందిన శ్రీరాముల వారూ... సీతాదేవీ ఈ ఆంజనేలూ.. వెరిసి వీళ్ళేం మిగతా వాళ్ళలాంటి అల్లాటప్పా వాళ్ళుకాదూ.. వీళ్ళ తీరేవేరూ, రూటేవేరూ.. అబ్బే... మిగతా రాముల వారి కన్నా ఈ రాములవారి నామం మిన్నా... ఆ ఆంజనేలు గారూ వారి తోకా..



సోంరెడ్డికి వళ్ళంతా కారం పూసినట్లయి వాడివంక జాలిగాచూశాడు. బహుశా రాత్రి నుండీ ఏకధాటిగా ఇచ్చిన ట్రీటుమెంటుకు వాడి బుర్ర కాస్తా వదులయి వుంటుందని కాస్తంత గుర్రుగా చూశాడు.

''అబ్బా.. కానేవాడికి శ్రీరాముడు లోకువ... సీతమ్మ వారింకా చవక.. ఆంజనేలు సంగతి సరే. కావలసిందంతా కాలజ్ఞానం."

"కాలజ్ఞానం! వీరబ్రహ్మేంద్రస్వామీ.."

"నో...నో...సార్.. టైమ్‌సెన్స్. విగ్రహాల ధర వాటి ఆయుష్షును బట్టి... ఇంగ్లాండ్ స్కాచ్‌విస్కీ.. రమ్ము డ్రమ్ములా... బాగా పాతబడిపోయిన కొద్దీ ధర అట్లా పెరిగిపోతుందన్నమాట! పాండ్యులూ.. కళింగుత్త చోళులూ. బహుమనీ సుల్తానులూ ఇంకా మనం కంఠతా పట్టి పరీక్షలు పాసుకానక్కరలేదు. ఇవి మాత్రం కచ్చితంగా అయిదు నుండి ఆరువేల సంవత్సరాల నాటివని నిజంగా చెప్పగలను."

"ఆ! మరీ అంతమాత్రమే ఎందుకూ? ఇంకా ఏడో ఎనిమిది వేలో కలిపేసుకుంటే రేపు పంపకాల దగ్గర పేచీలేం వుండవు గదాని!" రామలింగం లౌక్యం ప్రదర్శించబోయి సోంరెడ్డి మరో కొత్త లాఠీని సన్నద్ధం చేసే కార్యక్రమాన్ని అవలోకించి అప్పటికి విరమించి నోరు మూసుకున్నాడు.

"సరేగాన్రా.. ఆ కంబక్తూ.. న్యూజెర్సీ.. స్కాచ్‌విస్కీ కాంట్రాక్టరు గారితో బేరం సెటిల్మెంటు సంగతి ఆలోచిద్దాంగానీ.. ఎన్నడు తిని చచ్చారో.. ముందు తిండ్లుతినండి! ఒరే సెవెంటీ సిక్స్... మనోళ్ళకు కాస్త మాంచి భోజనం తగిలించు. అవే రెడ్డిమెస్!"

వాళ్ళ ముగ్గుర్నీ బయటకు పంపి ఎస్సై సోంరెడ్డి లాకప్పు గదిలోని పాత టేబిలు మీద సీతారాముల వారి పట్టాభిషేక పంచలోహ విగ్రహాలను, మోకాళ్ళమీద మోకరిల్లి తన్మయంగా చూడడంలో లీనమైన, పోతున్న తరుణంలోనే సోంరెడ్డి పక్కగదిలో పాత తుపాకీ ఏదో పేలినట్లు అదిరిపోయాడు. దీక్షగా, పరీక్షగా చూస్తే మూగాళ్ళమీద ఒంగొని భక్తితో రాములవారిని సేవించుకుంటున్న శ్రీఆంజనేయుల వారి వాలం వయ్యారంగా వంపులు తిరిగి ఏటవాలుగాపైకైతే లేచివుండేగానీ... గానీ... ఆ చివరేంటి ? దెబ్బతినిపోయిన 'పాం' తోకలా.. పూరాగా మొండిబడి నిక్కి చూస్తుందేం కర్మ! అసలు బొచ్చేదీ?

సోంరెడ్డి గుండెలు గుబగుబలాడాయి. కనుక్కోవాలి! అవునూ.. అయినా ఆ పల్లవులూ లిచ్ఛవుల కాలం నాటి శ్రీఆంజనేయులుగారి వాలం తీరు అట్లాగే వుండి వుండవచ్చు...! ఆలోచించాలి!

హన్నా! దీనికేదో కచ్చితమైన బలమైన కారణం వుండే వాడాలి. ఎంతైనా పోలీసు బుర్రకాబట్టి తనకు తట్టకపోవటంలో వింతేమీలేదు.

అయినా ఇది ముమ్మాటికీ వింతే!

కనుక్కోవాలి!

☆ ☆ ☆

మారోజు మల్లాచారి తాతముత్తాతలెపుడూ మారాజులు కానే కారనేది వాస్తవం! చిన్న పెంకుటింటి వసారాలో తాతతండ్రులందించిన వారసత్వం.. నైపుణ్యం పుణికి పుచ్చుకుని కలిగిన ఆసాములు ఆడంగులకు చెవికమ్మల నుండి.. చంద్రహారాలు.. జిగినీగొలుసులు... చెంపసరాలు.. కొండొకచో వాళ్ళ ముత్తాతలైతే ఏకంగా అరకిలోల వడ్డాణాలే అందంగా తయారు చేసి దొరల.. వటేండ్ల భార్యలకు అందించి 'శెహబాష్' అనిపించుకున్నారని చరిత్రే చెబుతుందని మల్లాచారి మందీమార్బలం పన్లేక మూగినపుడు సుదీర్ఘోపన్యాసం చేసి అలసిపోతాడు.

గత కొద్దినెలలుగా మల్లాచారి మనసు మల్లగుల్లాలు పడి మనిషి నీరసించి పోతున్నాడు.

మార్కెట్లో బంగారం ధర ఎదుగుదలా.. తగ్గుదలా ఎప్పటికీ అంతుబట్టని దేవరహస్యంగా మారిపోయింది. అసలు జనాలు బంగారం నగలమాట అటుంచి, మదుపుగా స్టాక్‌మార్కెటు... షేర్లూ.. ఎక్స్ఛేంజీలు... బార్లకు ఎగబడడంతో మల్లాచారి మండిపడుతూనే.. శాంతంగానే పండ్లు టకటక లాడించుకుంటూ గడుపుతున్నాడు.

మల్లాచారి దీర్ఘంగా వివరాలు సేకరించి నివ్వెరపోయాడు. మద్రాను - బొంబాయి మహానగరాల్నుండి భారీయంత్రాలపైన తయారు చేసిన అత్యంత ఆకర్షణీయమైన ఆభరణాలు భారీగా మార్కెటు నిండా కమ్ముకుంటున్నాయని తెలిసి మల్లాచారి కృంగిపోయాడు.

ఆ దినం అతడి భార్య అలివేలు గది గుమ్మానికానుకుని ఏదో దారంతో లేసులు కుట్టుకుంటోంది. ఎండబాగా తగ్గిందేమో బయట వీధి చల్లగా వుంది. కాస్త ఎడంగా... ఎదురుగా వున్న రాములవారి కోవెలలో ఎవరో భక్తుడు గంటమోగించాడు. ఈ మధ్య అలివేలు మల్లాచారితో ముభావంగానే వుంటుంది. పలకరింపులకు నిస్తేజంగా జవాబు. మునుపటంత ఉత్సాహమూ లేదు - ఉల్లాసమూ లేదు!

అపుడే వీధిలో సంబరంగా పోతున్న

మాలవాడ పోశాలునూ.. వాడి భార్యను మల్లాచారి కేకేసి పిలిచాడు.

"ఏరా పోరికి లగ్గం పెట్టుకున్నారేమో.. ఎప్పుడ్రా పెండ్లి?" మల్లాచారి యథాలాపంగానే అడిగాడు. వాళ్ళిద్దరూ ముందు బిత్తరపోయి ఆగి "గదే వరంగల్లు బస్సు దిగినమయ్యా.. గివ్వాల్నేనాయె పెండ్లి.. వరంగల్ బోయి గదే... పుస్తెలు... మట్టెలు... గదే మతలబు!" నీళ్ళు నములుకుంటూ పోశాలు వినయంగా చెప్పాడు –

"గాద్దెగొడక.. థు.. తరతరాల్నుండి మేం చేస్తెగాదుర మీరందరు పెండ్లిల్లు చేసుకున్నది! పిల్లల్ని గంటున్నది. గిపుడు అట్ల మార్కెటుకు పోయి కొనితెచ్చుకుని పెండ్లాల మెడలకు కట్టేసుకోటమే! థు.. మీ సంసారాలు గట్ల నిలబడతాయిర!

"గదేందయ్య ఆచారీ... నీ 'పనితనం' నీ ఇంట్లె సూపిస్తె నీకూ పిల్లో పోరడో పుట్టేడిది! పాపె... పా...పా.!" పోశాలు రుసరుసలాడుకుంటూ భార్యతోని వెళ్ళిపోయాడు.

☆ ☆ ☆

ఆ రాత్రి భోజనాలు చేసి పడుకోబోయేవరకూ ఏదో ఒక సందర్భంలో 'పనితనం' గురించి అలివేలుకు పదే పదే జ్ఞాపకం రావడం.. బాగా ఆలోచించిన కొద్దీ మొగుడిలో 'అది' లోపించిందా అన్న అనుమానం తన్నుకురావడం... అదేదో అతి విడ్డూరమైన 'వింత' విషయంలా తోచి కిందామీదా పడీపడీ నవ్వడం.. నవ్వుతున్నపుడు ఒళ్ళూపై తెలవకుండా.. మల్లాచారికి మాత్రమే ఒళ్ళు మండిపోయేలా వెనక్కీ ముందుకీ ఊగడంలో చారి సహనం అడుగంటిపోయింది.

"ఏంటె ఏంటె నీసంగతి?" మీద పడి రక్కినంత పని చేస్తూ అలివేలు భుజాన్ని ఒడిసి పట్టుకుని అడిగాడు.

"ఏంలేదు లేవయ్యా! నీ పనితనం. అదే పని–తనం గురించి.."

మల్లాచారి నిగ్రహం పట్టలేక లాగి చెంప చెళ్ళుమనిపించాడు.

అలివేలు ముందు బిత్తరపోయి ఆనక నిప్పులు చెరిగే కళ్ళతో చారిని నిలువెల్లా దగ్ధం చేసిపారేసేలా చూసి, మంచంలో బాగా ముడుచుకుని పడుకుంది. మల్లాచారి కుతకుత వుడికిపోయాడు. అసలు పనే లేనపుడు తన పనితనం సంగతి తేలేదెట్లా? దీనికీ.. దాని వాగుడికీ బుద్ధి చెప్పేదెట్లా? నోరు మూయించాలి! తరతరాలుగా తన తాతముత్తాతలు గుళ్ళలో విగ్రహాలు తయారు చేశారు! అద్భుతమైన నగలు నగిషీలు చెక్కిన వంశం తనది! తన పనితనం మీద అలివేలు అనుమాన పడడం.. ఏదో నాల్రోజులు తనకు నగల గిరాకీ రాకపోవచ్చు.. అయినా ఎల్లకాలం ఇట్లాగే తగలబడుతుందా? హు..!

ఇది జరిగిన మూడ్రోజులకు మల్లాచారి ఇంటిముందు రంగు వెలిసిన పాతడొక్కు కారు ఓటి వచ్చి ఆగడంతో మల్లాచారి గుండాగినంత పనయ్యింది!

☆ ☆ ☆

"ఉత్త బిరియానీ ముద్ద నాకు దిగదు!" పాపారావు బాగా కొవ్వుపట్టిన శరీరాన్ని పైకీ కిందకీ కుదేశాడు.

"ఒరే... రెండ్రోజుల్నుండీ తన్నులు.. కుందాపోట్లు మనం ఏమీ తిన్లేదని గుర్తుంచుకోండి! మనం కాస్తంత ఎంగిలి పడ్డాక వాడు మళ్ళా కోటింగు మొదలు పెడితే బతకడం కష్టం!"

"అంటే – మళ్ళా తన్నులా? నా వల్ల కాదు.. అటు సందులో జొరబడి ఏదో ఒక బస్సెక్కుదాం!" బంగారయ్య మిక్కిలి భయంగా వణికిపోతూ చొల్లుకార్చాడు.

"మరి మన సీతారామ పట్టాభిషేకం విగ్రహాల సంగతేంటి? వాటిని అట్లానె వదిలేసి అవతల పడదామా?" రామలింగం కళ్ళు చిట్లించి అన్నాడు. అయితే వాళ్ళకు అట్లాటి అవకాశం ఏకోశానా సీనియరు యస్సయి సోంరెడ్డి ఇవ్వదలచుకోలేదు. కనుకనే ఓ ఫిరంగి గుండులాంటి బోడి, బుర్రమీసాల కానిస్టేబులు ఎపుడూ కుర్రగా.. అందరినీ క్రూరంగా చూసేవాడ్ని వీరిపై అజమాయిషీకి అదనపు గన్‌మెన్‌లా ఏర్పాటు చేశాడు.

"అవునుగాన్రా... యస్సయి పంపకాలు... వాటాలు.. అన్నాడు గుర్తుందా?" రామలింగం సాలోచనగా అన్నాడు.

"గెడిదెకొడకా.. బేరం మాట్లాడేవాడివి.. వాడు ఏదేశం వాడో.. ఏరకం వాడోపూరాగా ఆరా తీయలేకపోతివి. ఎంతసేపూ

ధర... లక్షలు... క్రీ.పూ....క్రీత లతోనే కాలమంతా గడిపితివి గదరా!" పాపారావు కృద్ధుడై అరిచాడు.

ఫిరంగి గుండులాంటి బుర్రమీసాల పోలీసుకు ఇదంతా వింటుంటే తన క్రూరత్వం మాయమై వుప్పెనలా నవ్వు తన్నుకువచ్చింది.

"ఒరి నీచ అమాయకప్రాణుల్లారా! మీరు మా డిపార్టుమెంటు గురించి ఇంత చవగ్గా... చవటగా ఆలోచించడం ఎంతమాత్రం క్షమార్హం కాదు... అసలు పోలీసోడికి వాటాలు తీసుకునే హక్కే కానీ... ఇచ్చే అవసరం మా మాన్యువల్‌లోనే లేదు గదా! నువ్వలాంటపుడు మీకు మీ వాటాగా పదేండ్లో పాతికేండ్లో అజ్ఞాతవాసం... కాదంటే ఎదురు కాల్పుల్లో ఎన్‌కౌంటరూ – ఛ్ఛ్... బతకడం తెలవలి అమాయక ప్రాణులు.."

గుండుమీసాలాయన ఆ పై మాటలు పైకే అనేసి పెదవి విరవడంతో ముందు బంగారయ్య అయోమయంలో పడ్డాడు. పాపారావు పిర్రను రహస్యంగా లగాయించి గిల్లడంతో వాడు గగ్గోలు పెట్టాడు – రామలింగం మాత్రం లౌక్యంగా ఓ వెధవ నవ్వు నవ్వి ముగ్గుర్నీ కూడదీసుకుని రాణాలో అడుగు పెట్టగానే తన కాళ్ళకింద భూమి బద్దలై శ్రీభూదేవి గర్భకుహరంలోకి జారబడిపోతున్నట్లు... తన నెత్తిమీద వేయి పిడుగులు చెట్టాపట్టాలేసుకుని చుట్టపుచూపుగా వచ్చి ఏకమై ఒక్కసారే దిగబడినట్లు చిన్న ఆర్తనాదం ఓటి చేశాడు.

లోపల లాకపుగదిలో సీతారాముల పట్టాభిషేకం సీనుముందు సీనియరు యస్సయి సోంరెడ్డితో మారోజు మల్లాచారి కులాసాగా విసుళ్ళు విసురుకుంటూ మాట్లాడుకుంటున్నారు!

☆ ☆ ☆

డొక్కుదో, సొట్టదో... రంగు వెలిసిందో గానీ.. ఒక కారు అదీ తన పింకిలిపెంకుటింటి ముందుకు సరాసరి వచ్చి ఆగడంతో మల్లాచారికి మైకం కమ్మినంత పనయ్యింది. ఆ మైకంలోనే అర్ధాంగి అలివేలు వంకా.. కాస్తంత తమకంగా.. మరికాస్త బింకంగా చూసి చిరుగుల పంచె కాస్త సవరించుకున్నాడు.

కార్లోంచి బంగారప్పన్ను మెరుస్తూ... భారీగా శరీరాన్ని కదుపుతూ... ఒంగిన ఈటెలా ఒళ్ళు విరుచుకుంటూ వచ్చిన ముగ్గుర్నీ ఎక్కడ కూచోమనాలో తెలియక మల్లాచారి ఒక బొంత సంపాదించి పక్కదొడ్డని చింతచెట్టుకింద పరిచి ఒక రాతి చెప్టా మీద భోగరాజులు ఠీవిగా కూర్చుండిపోయాడు.

అలివేలుకు మాత్రం ఇదంతా అయోమయంగానే వుంది. ఓ రెండు గంటలు వాళ్ళ అరుపులు.. విరుపులు మూగసైగలు... సైసైలు.. చూస్తుంటే తన మగని పనితనం మీద వున్న గురి మరికాస్త సన్నగిల్లసాగింది. కారణం మరేం లేదు గానీ ఆ సంభాషణలు పూర్తయ్యే సరికి మల్లాచారి మరింత ఒదిగిపోయి కుంగిపోయి నేలబారు మనిషిలా కనిపించాడు. పుణ్యానికి దొరికిన గంజి నాకిన కుక్కలా ఊరికే తలాడించడం... అలివేలుకు మరోగిట్టని కొరుకుడు పడని సంగతాయె!

ఇట్లాంటి వాడితో.. చాతకాని దద్దమ్మతో తాను కాపురం చేసింది. తానిక జీవితంలో తల్లి నవుతానన్న ఆశ ఏ కోశానా లేదు – ఇంకేం చేయాలి? అసలా మనిషి ఇంత దేబిరి తనానికి దిగిపోయాడు.

కారు వాళ్ళు హుషారు చేసి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి నుండీ మల్లాచారి పన్లోది దిగిపోయాడు. రాత్రంతా మధ్యింట్లో కుంపటీ.. రాగీ... ఇత్తడీ.. కుసింత వెండీ.. ఇంకా ఏవో చండాలం ముందేసుకుని ఎర్రబారిన కండ్లతో.. చెమట్లు కక్కుతూ.. ఊదుగగొట్టంతో కుస్తీలు పడుతూ రాత్రింబవళ్ళు ఒకటే కసరత్తు ప్రారంభించాడు. మనిషి గెడ్డం పెరిగి.. బుగ్గలు.. కండ్లు లోతుకు పీక్కుపోయి చూడడానికి పరమ వికారంగా కనిపిస్తుంటే అలివేలు పమిటతో ముక్కు గట్టిగా మూసుకుని, తప్పుకుని తిరిగి – కుక్కిమంచం మీద మూడంకె వేసి ముసుగు తన్నేసింది!

(ఇంకా ఉంది)